క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ



గుంటూరు మెడికల్: సేవా పక్వాడాలో భాగంగా బీజేపీ నేతలు పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. బ్రాడీపేటలోని మూడో మండల బీజేపీ కార్యాలయంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. 3వ మండల అధ్యక్షురాలు గాయత్రి బెహరా ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాయత్రి బెహరా మాట్లాడుతూ మనందరం ఆరోగ్యంతో ఉంటున్నామంటే అది పారిశుద్ధ్య కార్మికుల కృషియేనన్నారు. పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా పక్వాడా కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జంధ్యాల పవన్ కుమార్, మండల కోశాధికారి అన్నా కిషోర్, రాధాకృష్ణ, సంతోష్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆధిపత్య పోరుతో నిలిచిన ఎఫ్.డి.సి. చైర్మన్ నియామకం

సినీ దర్శకుడు దిలీప్‌రాజా

నగరంపాలెం: ఆధిపత్య పోరు వలనే ఎఫ్.డి.సి.చైర్మన్ నియామకం నిలిచిపోయిందని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఏపీ 24 విభాగాల యూనియన్(మా-ఏపీ) వ్యవస్థాపకులు, దర్శకుడు దిలీప్‌రాజా ఆరోపించారు. గుంటూరులో ఓ ప్రైవేట్ అతిథి గృహంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి నాయకుల వల్లే పదవిని ఇప్పటి వరకు భర్తీ చేయలేదని అన్నారు. డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నిర్మాత ఎ.ఎం.రత్నం పేరును సిఫారసు చేశారని వివరించారు. అప్పటికే సినిమాటోగ్రఫీ మంత్రి పదవి జనసేన ఖాతాలో ఉండటంతో, ఎఫ్.డి.సి. చైర్మన్ పదవి అధికార పార్టీకి కేటాయించాలనే ప్రచారం జరిగిందని అన్నారు. ఈ పదవికి ఎవర్ని నియమించినా ఆంధ్రలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన డైనమిక్ నాయకుడు అవసరమని అన్నారు.

అలరించిన తాళంభజన




నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆంజనేయ భక్త సమాజం(ఉన్నవ) ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తాళం భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కుర్రా ఆంజనేయులు బృందం పలు భక్తిగీతాలను ఆలపించారు. ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా కళాశాల సంస్కృతాధ్యపకులు డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వరరావు, గుళ్లపల్లి సుబ్బారావు, పెద్ది సాంబశివరావు పాల్గొన్నారు.

రైళ్లలో చైన్ స్నాచింగ్ చేసే ముగ్గురు అరెస్ట్

లక్ష్మీపురం: రైళ్లలో ప్రయాణికులు నిద్రిస్తున్న సమయంలో వారి మెడల్లో ఉన్న బంగారం వస్తులను దొంగిలించే ముగ్గురిని రైల్వే జీఆర్పీ సిఐ అంజిబాబు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. జీఆర్పీ సిఐ తెలిపిన వివరాల ప్రకారం ఇటీవల కాలంలో కేసీ కెనాల్ వద్ద రైళ్లలో ప్రయాణికుల మెడల్లో ఉన్న బంగారు ఆభరణాలను, విలువైన వస్తువులను చోరీ చేసిన ఘటనపై రైల్వే జీఆర్పీ డీఎస్పీ అక్కేశ్వరరావు ఆదేశాల మేరకు సీఐ అంజిబాబు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో గుంటూరు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం చివర భాగంలో జీఆర్పీ పోలీసులను చూసి ముగ్గురు వ్యక్తులు పరారీ అవుతున్న క్రమంలో సీఐ అంజిబాబు గుర్తించి వారిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారించారు. వారిలో హరియానా రాష్ట్రానికి చెందిన సతీందర్, రాజస్థాన్‌కు చెందిన సతీష్ గుజ్జర్, రవికుమార్ ప్రజాపతి అనే వారు వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చి నేరాలు చేసి పరారీ అవుతుంటారని పోలీసుల విచారణలో తెలింది. కేసీ కెనాల్ వద్ద రైళ్లలో ప్రయాణికుల నుంచి బంగారం ఆభరణాలు స్నాచింగ్ చేసి పరారీ అయినట్లు అంగీకరించారు. వీరి వద్ద చోరీ చేసిన బంగారు సొత్తు సుమారు రూ.1.80 లక్షల విలువ చేసే 33.5 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

యాంటిబయాటిక్స్ ఎక్కువైతే సెప్సిస్

- వైద్యుల సలహాలు లేకుండా వాడితే ప్రమాదమే
- ఇన్‌ఫెక్షన్‌లపై అవగాహన లేకపోతే ప్రాణాంతకం



గుంటూరు మెడికల్: ఇటీవల మందుల వాడకం ఎక్కువైంది. చిన్న సమస్యకు కూడా వైద్యుల సలహా లేకుండానే యాంటిబయాటిక్స్ వాడేస్తున్నారు. కొంతమందికి మందులు వాడుతున్నా పనిచేయని స్థితికి చేరుకుంటున్నారు. ఇలా అవసరం లేకపోయినా, అవగాహన లేకుండా వినియోగించడంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోయి అనేక మంది ఇన్‌ఫెక్షన్‌ల బారిన పడుతున్నారు.

సెప్సిస్ అంటే....

తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌ను సెప్సిస్ అంటారు. ఇది ఒక ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన జబ్బు. ప్రపంచంలో ప్రతి రెండు సెకన్‌లకు ఒకరు చనిపోతున్నారు. శరీరంలో ఇన్‌ఫెక్షన్ సోకినప్పుడు అవయవాలు దెబ్బతింటాయి. 80 శాతానికి పైగా ఇన్‌ఫెక్షన్‌లు ఆస్పత్రి బయటే సోకుతున్నాయి. సెప్సిస్ ఎవరికైనా సోకుతోంది.

వ్యాధి లక్షణాలు ....

ఇది సూక్ష్మ క్రిముల ద్వారా వస్తుంది. శరీరంలో ఉష్ణోగ్రతలు హెచ్చు తగ్గులుగా ఉండటం, గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగంగా తీసుకోవడం, విపరీతమైన నీరసం, తీవ్రమైన చలి, ఆయాసం, మూత్ర విసర్జన తగ్గిపోవడం, బీపీ తగ్గడం, పెరగడం, రోగి తికమక పడడం, తదితర లక్షణాలు వ్యాధి బాధితుల్లో కనిపిస్తాయి.

వ్యాధి నిర్ధారణ....

బ్లడ్ కల్చర్, కార్బాఆర్, బయోఫయర్ టెస్ట్‌ల ద్వారా సెప్సిస్ వ్యాధిని నిర్ధారిస్తారు. అంటు వ్యాధి కారకాలు, వాటి విషపూరిత పదార్థాల వ్యాప్తి, వాటి స్థానం నుంచి రక్త ప్రవాహంలో కలవడం ద్వారా ఇన్‌ఫెక్షన్ సోకుతుంది. తక్షణమే గుర్తించి చికిత్స చేయని పక్షంలో శరీరంలోని పలు అవయవాలు ఇన్‌ఫెక్షన్‌ల వలన పనిచేయడం మానేసి రోగి ప్రాణాలు కోల్పోతాడు.

జిల్లాల్లో బాధితులు ....

గుంటూరు జీజీహెచ్‌కు ప్రతిరోజూ పది మంది బాధితులు సెప్సిస్‌తో బాధపడుతూ జనరల్ మెడిసిన్ విభాగానికి చికిత్స కోసం వస్తున్నారు. జిల్లాలో ఫిజీషియన్లు 120 మంది ఉన్నారు. ప్రతిరోజూ ఒక వైద్యుడి వద్దకు 10 మంది ఇన్‌ఫెక్షన్‌ల బారిన పడి చికిత్స కోసం వస్తున్నారు. వీరికి సకాలంలో వ్యాధి నిర్ధారణ చేసి వైద్యం అందించని పక్షంలో తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌గా(సెప్సిస్) మారి రోగులను ఐసీయూలో అడ్మిట్ చేయాల్సి వస్తుంది.

వ్యాధి సోకే భాగాలు ....

ఇన్‌ఫెక్షన్లు నూటికి 50 శాతం ఊపిరితిత్తుల్లో వస్తాయి. తదుపరి కిడ్నీలు, బ్రెయిన్, యూరినరి ట్రాక్ట్, చర్మం, ఇతర భాగాల్లో వ్యాధి ఇన్‌ఫెక్షన్లు సోకుతాయి. కడుపులో ఇన్‌ఫెక్షన్లు రావడం ద్వారా అల్సర్లు ఏర్పడతాయి. క్యాన్సర్ బాధితులు, షుగర్ బాధితులు, కాలిన గాయాల వారిలో, మేజర్ ట్రామా బాధితుల్లో, హెచ్ఐవీ బాధితుల్లో సూక్ష్మ క్రిముల ద్వారా ఈ వ్యాధి త్వరితగతిన ఎక్కువ మందిలో వ్యాప్తి చెందుతుంది. కాళ్లల్లో పుండ్లు ఏర్పడి చీము పట్టి పరిస్థితి ప్రమాదంగా మారి కొన్ని సార్లు ఆపరేషన్‌ల ద్వారా ఆగాయాలను తొలగించాల్సి వస్తుంది.

సెప్సిస్‌పై 3డీ దాడి....



సెప్సిస్‌ను నియంత్రించాలంటే 3డీ దాడి చేయాలి. తొలుత ఇన్‌ఫెక్షన్ నిర్ధారణ కచ్చితంగా జరగాలి. అవసరమైన చికిత్స చేయించాలి. మల్టిప్లెక్స్ పీసీఆర్ అనే అధునాతన పరీక్షతో త్వరితగతిన సెప్సిస్‌ను నిర్ధారించవచ్చు. బయోఫైర్ ద్వారా కేవలం మూడు గంటల్లో వ్యాధి నిర్ధారణ చేయవచ్చు. శరీరంలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించుకునేందుకు సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు యాంటిబయాటిక్స్ వైద్యుల సలహా మేరకు మాత్రమే వాడాలి.

–డాక్టర్ కోగంటి కళ్యాణచక్రవర్తి, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్టు, గుంటూరు

పని గంటల పెంపునకు వ్యతిరేకంగా నిరసన



మాట్లాడుతున్న పాశం రామారావు, లక్ష్మణరావు

లక్ష్మీపురం: కార్మికుల పనిగంటల పెంపునకు నిరసనగా ఈనెల 7వ తేదీన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివిధ సంఘాల నాయకులు తెలిపారు. స్థానిక రైతు సంఘం కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్ కుమార్, కౌలు రైతు సంఘం సీనియర్ నాయకులు పాశం రామారావు,జిల్లా అధ్యక్షులు బొట్ల రామకృష్ణ మాట్లాడారు. ఎన్డీఏ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సంపదను లూటీ చేసి కార్పొరేటర్లకు కట్టబెడుతుందని, నిరుద్యోగం, పేదరికం, దారిద్ర్యం పెరుగుతుందని తెలిపారు. కార్మికుల బలిదానాలతో సాధించుకున్న 8 గంటల పని విధానానికి స్వస్తి పలికి కార్మికుల శ్రమను కొల్లగొట్టి కార్పొరేట్లకు కట్టబెట్టడానికి 13 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టారని దీనిని ఆంధ్రప్రదేశ్లోని కూటమి ప్రభుత్వం అమలు చేయడం కోసం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిందని ఇది కార్మిక వ్యతిరేక చర్య అని దీని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడంతో మతోన్మాద కార్పొరేట్ శక్తుల యొక్క లాభాల కోసం నయా ఉదారవాద విధానాలను దూకుడుగా అమలు చేస్తుందని, రాజ్యాంగాన్ని బలహీనపరిచి శ్రమజీవులు హక్కులను కాల రాస్తున్నాయని ఆరోపించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య హక్కులను నిర్వీర్యం చేసి ఫాసిస్టు ఆర్ఎస్ఎస్ నియంత్రణలో మత విద్వేషాన్ని వ్యాప్తి చేయడం ద్వారా ప్రజల ఐక్యతను దెబ్బతీసేందుకు బీజేపీ హిందుత్వ మత్తత ఏజెండాను ముందుకు తీసుకువచ్చి భారత సెక్యులర్ విధానానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. రైతాంగం పోరాడి వెనక్కి నెట్టిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలు చేస్తుందని ఆరోపించారు. రైతులకు పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక ప్రైవేట్ అప్పులకు బలైపోయి రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, ఆహార భద్రత చట్టాలకు తూట్లు పొడుస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కార్మిక కర్షక హక్కుల సాధనకై ఉద్యమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీన గుంటూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 13 గంటల పని విధానానికి నిరసనగా జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రేపు తెనాలిలో మాస్టర్ ప్లాన్‌పై ప్రత్యేక సమావేశం

తెనాలిఅర్బన్: సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో, ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ లిమిటెడ్ వారి సహకారంతో తెనాలి పట్టణ మాస్టర్ ప్లాన్‌పై ప్రత్యేక సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జాగారపు రామ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి పట్టణ మాస్టర్ ప్లాన్‌ను తయారు చేసేందుకు ఆర్‌వీ ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ లిమిటెడ్ సంస్థకు ప్రభుత్వం అప్పగించిందని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశంలో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొంటారని చెప్పారు. మాస్టర్ ప్లాన్‌పై సలహాలు, సూచనలు స్వీకరించడం జరుగుతుందన్నారు. పట్టణ ప్రముఖులు, వివిధ సంస్థల నిర్వాహకులు పాల్గొనాలని కోరారు.

12న ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈనెల 12న జాతీయస్థాయిలో ఉపాధ్యాయ రత్న, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం చేసేందుకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యా, విజ్ఞాన బోధనతో పాటు సాహిత్య, సాంస్కృతిక, కళా, క్రీడా రంగాల్లో అత్యుత్తమ శిక్షణ ద్వారా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న అధ్యాపకులు, ఉపాధ్యాయుల ప్రతిభ, సేవానిరతిని వెలుగులోకి తెచ్చి, వారిని మరింతగా ప్రోత్సహించేందుకు హైదరాబాద్‌లో పురస్కారాలను ప్రదానం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు విద్యాసంస్థల్లోని ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యా బోధనతో పాటు కళా, క్రీడా, సాంస్కృతిక, యోగా అంశాల్లో వారి అర్హతలు, అనుభవానికి సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్, పేపర్ క్లిప్పింగ్స్, నాలుగు పాస్‌పోర్ట్ ఫోటోలతో దరఖాస్తును ఈనెల 10లోపు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ, డోర్ నంబరు 1-20-164, గోకుల్ నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపాలని సూచించారు. ఇతర వివరాలకు 96523 47207 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

దాతల దాతృత్వం ప్రశంసనీయం



నూతన తరగతి గదులను ప్రారంభిస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అదనపు గదులను శనివారం ప్రారంభించారు. స్థల దాతలు శ్యామల గోపాలరెడ్డి, రామసుశీల దంపతుల జ్ఞాపకార్థం కుమారులు శ్రీనివాసరెడ్డి, రఘునాథరెడ్డి కుమార్తెలు మేకా శివనాగేంద్రం, మువ్వా నాగమల్లేశ్వరి, బట్టగిరి ధనలక్ష్మి, అల్లుడు మువ్వా ఈశ్వరరెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో దాదాపు పన్నెండు లక్షల రూపాయలతో నిర్మించారు. మోడల్ ప్రైమరీ స్కూల్‌గా అప్ గ్రేడ్ అనంతరం పాఠశాలలో గదుల కొరత, విద్యార్థుల అసౌకర్యాన్ని గుర్తించి మెగా పేరెంట్స్‌డే కార్యక్రమంలో విద్యాకమిటీ, ఉపాధ్యాయుల విన్నపాలకు స్పందించిన దాతలు ఈశ్వరరెడ్డి శ్రమించి రెండు నెలల్లో నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చి ప్రభుత్వానికి అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గాయత్రిదేవి, రిటైర్డ్ వ్యాయామ అధ్యాపకుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ దాతలు స్పందించి నిర్మాణం చేపట్టడం హర్షణీయమని చెప్పారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటరు శ్యామల వెంకటరమణాదేవి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చావా సరోజిని, ఉపాధ్యాయులు రామచంద్రరావు, హనుమంతరావు, శ్రీనివాసరావు గ్రామ పెద్దలు మాజీ సర్పంచి బ్రహ్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కుర్రా పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ట్రంప్ విధానాలను భారతీయులంతా వ్యతిరేకించాలి

తాడేపల్లి రూరల్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలను భారత పౌరులందరూ వ్యతిరేకించాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ పిలుపునిచ్చారు. ఉండవల్లి సెంటర్‌లోని సీపీఎం కార్యాలయంలో శనివారం కుంభ ఆంజనేయులు అధ్యక్షతన పార్టీ రాజధాని డివిజన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ అదనపు సుంకాలు పెంచి భారత్‌ను అదుపు, ఆజ్ఞల్లో ఉంచుకోవాలని ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలపై కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం సరైనది కాదని పేర్కొన్నారు. సామ్రాజ్యవాద దేశమైన అమెరికా తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, దాన్నుంచి బయట పడేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలపై అదనపు సుంకాలు విధిస్తోందని వివరించారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం. రవి మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి చూపించడం లేదని విమర్శించారు. పేదలకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఎం నేతలు భాగ్యరాజు, నవీన్ ప్రకాష్, వల్లభాపురం వెంకటేశ్వరరావు, పేరం బాబూరావు, చెంచయ్య, రామకృష్ణ, జానీ, పార్వతి, షేక్ ఖాదర్ బాబా పాల్గొన్నారు.

పార్కుల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడండి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ఇంజినీరింగ్ అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: గాంధీ పార్క్‌లో తగిన లైటింగ్ ఉండేలా లైట్లు ఏర్పాటు చేయాలని, పార్క్ పరిసరాల్లో మెరుగైన పారిశుద్ధ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ గాంధీ పార్క్, ఎస్వీఎన్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. గాంధీ పార్క్‌లో లైటింగ్ ఉండేలా ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. పచ్చదనం ఉండేలా పార్క్ సిబ్బంది మొక్కలు నాటడం, రోజువారీ నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. ఎస్వీఎన్ కాలనీలో పలు అభివృద్ధి పనులు పరిశీలించి, పనులు చేపట్టేప్పుడు విద్యుత్ పోల్స్ షిఫ్ట్ చేయడం, డ్రెయిన్లకు అడ్డుగా ఉండే వాటిని తొలగించాలని సూచించారు. ప్రజారోగ్య కార్మికులు ప్రధాన రోడ్లను స్వీపింగ్ చేసి, వచ్చిన మట్టిని డివైడర్‌లో వేస్తున్నారని, అలా వేయకుండా చూడాలని ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు స్థానికంగా ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సానుకూలంగా పరిశీలించి, నూరు శాతం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నగరంలోని అన్నా క్యాంటీన్ల వద్ద మౌలిక వసతులు కల్పనకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శనివారం ఆర్టీఓ కార్యాలయం రోడ్డులోని అన్నా క్యాంటీన్‌ను పరిశీలించారు. నోడల్ అధికారులు ప్రతి రోజు క్యాంటీన్లను పరిశీలించాలన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

- రూ.6 లక్షల విలువైన ఆపరేషన్ ఉచితం
- సీటీఎస్ వైద్యులకు అభినందనలు



మాట్లాడుతున్న డాక్టర్ యశస్వి రమణ, చిత్రంలో ఆపరేషన్ చేయించుకున్న మల్లికార్జున

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో కార్డియో థొరాసిక్ సర్జరీ వైద్యులు అత్యంత అరుదైన శస్త్రచికిత్స చేసి, చేతికి పునర్జీవనం కల్పించారు. శనివారం ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ఆపరేషన్ వివరాలు మీడియాకు వివరించారు. పెదపలకలూరు గ్రామానికి చెందిన మల్లికార్జున అక్టోబరు ఒకటి తేదీన పనిచేస్తున్న సమయంలో చెయ్యి మిషన్‌లో పడి తీవ్ర గాయమైంది. చేతి నరాలు తెగిపోయాయి. తీవ్ర గాయాలతో జీజీహెచ్‌కు వచ్చిన మల్లికార్జునకు కార్డియో థొరాసిక్ వైద్యులు వెంటనే అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి చేతికి పునర్జీవం కల్పించారు. సుమారు రూ.6 లక్షలు ఖరీదు చేసే ఆపరేషన్‌ను ఉచితంగా చేసినట్లు కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణమూర్తి తెలిపారు. తమ విభాగంలో సాధారణ శస్త్రచికిత్సలతో పాటు, అత్యవసర ఆపరేషన్లు చేస్తున్నామని, ప్రజలు వైద్య సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. రోగికి తీవ్రగాయంతో అత్యవసర ఆపరేషన్ చేసి చేతిని కోల్పోకుండా చేసిన సీటీవీఎస్ వైద్యులను సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అభినందించారు. ఆపరేషన్ ప్రక్రియలో పాల్గొన్న డాక్టర్ కుప్పుస్వామి, డాక్టర్ యోగి, మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ కె.పోలయ్య బృందానికి అభినందనలు తెలిపారు.

ప్రఖ్యాత పర్యావరణ వేత్త జేన్ గూడాల్‌కి ఘన నివాళి

ఏఎన్‌యూ(పెదకాకాని): ప్రఖ్యాత పర్యావరణ వేత్త ఎథోలాజిస్ట్, ప్రిమటాలజిస్ట్, ఆంత్రోపాలజిస్ట్, జీవహక్కుల పోరాట యోధురాలు జేన్ గుడాల్ చేసిన పరిశోధనలను విద్యార్థులు పరిశోధకులు ఆదర్శంగా తీసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం కోరారు. వర్సిటీలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన గుడాల్ చిత్రపటానికి పూలమాలలు వేసిన అధికారులు ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం మాట్లాడుతూ టాంజానియాలోని గోంబే స్ట్రీమ్ నేషనల్ పార్క్‌లో చింపాంజీల మీద ఆమె విస్తృతంగా పరిశోధనలు చేశారన్నారు. జీవ సంక్షేమం, పర్యావరణ పరిరక్షణపై ఆమె చేసిన కృషిని యువ పరిశోధకులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. పర్యావరణ విభాగాధిపతి ఆచార్య స్వామి మాట్లాడుతూ జీవుల మధ్య సామరస్యాన్ని కాపాడడానికి జేన్ గుడాల్ చేసిన కృషి అమోఘమైందన్నారు. బీఓఎస్ చైర్మన్ డాక్టర్ పి.బ్రహ్మాజీరావు మాట్లాడుతూ మానవుడు చింపాంజీల మధ్య అంతఃసంబంధాలను పరిశోధించడం ద్వారా గుడాల్ పర్యావరణ పరిరక్షణకు జీవుల మధ్య సామరస్యం ఎంతో కీలకమని ధ్రువీకరించారన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చేబ్రోలు లింగరాజు, వర్సిటీ ఎలక్ట్రికల్ డీఈఈ ఎస్.వెంకటేశ్వర్లు, బాలుర వసతి గృహాల డెప్యూటీ వార్డెన్లు డాక్టర్ ఎస్.బాబు, డాక్టర్ కె.శశిధర్, పరిశోధకులు సతీష్, కృష్ణ నాయక్ పాల్గొన్నారు.